తోడేస్తున్నారు!

గుట్టుచప్పుడు కాకుండా ఇసుక అక్రమ రవాణా

అడుగంటుతున్న భూగర్భజలాలు ● చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

షాబాద్: అక్రమార్కులకు ఈసీవాగు ఇసుక.. కాసుల పంటను కురిపిస్తోంది. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా యథేచ్ఛగా నిత్యం ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతూనే ఉన్నది. అనుమతులు లేకుండా అధికారుల కనుసైగల్లో గుట్టుచప్పుడు కాకుండా అక్రమార్కులు ఇసుకను తరలిస్తున్నారు. ఎస్ఓటీ పోలీసులు ఇసుక వ్యాపారుల వద్ద మామూలు తీసుకొని ఇసుక ట్రాక్టర్లను వదిలిపెడుతున్నట్లు వివిధ గ్రామాల ప్రజలు తెలుపుతున్నారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని ఎవరైనా ఫోన్ చేస్తే నేరుగా ఇసుక వ్యాపారులకు ఫోన్ చేసి ఫలానా వ్యక్తి ఫోన్ చేశాడని సమాచారం అందిస్తున్నారు. స్థానిక పోలీసులు కూడా ఇసుక ట్రాక్టర్ల వద్ద మామూలు తీసుకొని వ్యాపారులకు సహకరిస్తున్నట్లు వివిధ గ్రామాల ప్రజలు తెలిపారు. మండలంలో అక్రమ ఇసుక రవాణా జోరు ఆగడం లేదు. ఫలితంగా మండల పరిధిలోని పలు గ్రామాలు ఎడారులుగా మారుతున్నాయి. మండలంలోని ఏట్ల ఎర్రవల్లి, తిమ్మారెడ్డిగూడ, తాళ్లపల్లి, నాగర్‌గూడ, రుద్రారం, చందనవెళ్లి, హైతాబాద్, సోలిపేట్ తదితర గ్రామాల మీదుగా ఈసీ వాగు ఉంది. గతంలో వాగునిండా ఇసుక ఉండడంతో చుట్టుపక్క గ్రామాలు, వాగు పరిసర ప్రాంతంలో పచ్చని చెట్లతోపాటు బోర్లలో నీరు పుష్కలంగా ఉండేది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు వ్యవసాయాన్ని సాఫీగా చేసుకుంటూ జీవించేవారు. కానీ ప్రస్తుతం వాగులో నిండా ఉన్న ఇసుకకు బదులు పెద్ద పెద్ద గోతులతో పాటు ఎండిన పొలాలు ఎడారులను తలపిస్తున్నాయి. దిక్కుతోచని రైతన్న బిక్కుబిక్కుమంటూ ఉన్న ఊళ్లో ఉపాధి దొరకక వలస బాట పడుతున్నాడు. ఇసుక రవాణాను ఆపకుంటే గ్రామాలు ఎడారులుగా మారడం ఖాయమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నాగర్‌గూడ ఈసీవాగులో ట్రాక్టర్లలో ఇసుక రవాణా చేస్తున్న వ్యాపారులు

రాత్రిపూట అక్రమ దందా...

ఈసీ వాగులో నుంచి వ్యాపారులు రాత్రిపూట అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. వందల కొద్దీ ట్రాక్టర్ల ఇసుకను తరలిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ట్రాక్టరు ఇసుకను ఐదు కిలోమీటర్ల దూరం ఉన్న ప్రాంతానికి తరలిస్తే రూ.5 నుంచి 8వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారని సమాచారం. అదే అదనుగా భావించిన కొందరు వ్యక్తులు ట్రాక్టర్లను కొనుగోలు చేసి మరీ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థమవుతోంది. 2000 జనాభా గల గ్రామంలో 20 నుంచి 25 ట్రాక్టర్లు ఉన్నాయంటే పరిస్థితి అర్థమవుతోంది.



సోలిపేట్ ఈసీవాగులో జేసీబీతో ట్రాక్టర్లలో ఇసుక నింపుతున్న వ్యాపారులు

అసలు అధికారులేమి చేస్తున్నట్లు?

పెద్ద ఎత్తున అక్రమంగా ఇసుక రవాణా సాగుతున్నా అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అధికారుల కళ్ల ముందు నుంచి ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎవరైనా ఇసుక రవాణాపై అధికారులను ప్రశ్నిస్తే లిఖిత పూర్వకంగా తమకు రాసి ఇస్తేనే చర్యలు ఉంటాయని, తమ దృష్టికి రానప్పుడు తామెలా పట్టించుకుంటామని అధికారులు ఎదురు ప్రశ్నిస్తున్నారని అంటున్నారు. అధికారుల దృష్టికి వస్తేనే పట్టించుకుంటారో? మానవ మనుగడను దృష్టిలో పెట్టుకొని తగిన చర్యలు తీసుకుంటారో తెలియాలి.

కేసులు నమోదు చేస్తాం



ఈసీ వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని తమ దృష్టికి వచ్చింది. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తాం, గత నెలరోజుల క్రితం రెండు ట్రాక్టర్లను పట్టుకొని చలాన్‌లు వేశాం. ట్రాక్టర్లు వాగులో ఉన్నప్పుడు తమకు సమాచారం అందిస్తే వాటిని పట్టుకొని సీజ్ చేస్తాం. వాల్టా చట్టం కింద కేసు నమోదు చేస్తాం.

–మహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ, షాబాద్

ఎవరికి అనుమతి లేదు



ఇసుక అక్రమ రవాణా చేసేందుకు ఎవరికి అనుమతి ఇవ్వలేదు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే ట్రాక్టర్లను సీజ్ చేస్తాం. ప్రభుత్వ పనులకు, ప్రైవేట్ పనులకైనా ఇసుక రవాణాకు ఎటువంటి అనుమతి ఇవ్వడం లేదు. రాత్రి పూట అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం.

–ఎండీ అన్వర్, తహసీల్దార్, షాబాద్

చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం

ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి



జెడ్పీటీసీ మాలతి కృష్ణారెడ్డి దంపతులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న రంజిత్‌రెడ్డి తదితరులు

చేవెళ్ల: చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేద్దామని ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఆయన నివాసం వద్ద శుక్రవారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన జెడ్పీటీసీ మర్పల్లి మాలతి కృష్ణారెడ్డి దంపతులు, వారి అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, ఎంపీ రంజిత్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీకి బలమైన క్యాడర్ ఉందని కాంగ్రెస్ పార్టీకి చేవెళ్ల గడ్డ అడ్డాగా ఉంటూ వస్తోందని చెప్పారు. ఈ సారి కూడా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసేందుకు అందరం కలిసి పనిచేద్దామని చెప్పారు. చేవెళ్ల గడ్డ నాకు రాజకీయం నేర్పించిందని ఇక్కడి ప్రజలకు ఎప్పుడు రుణపడి ఉంటానన్నారు. కాంగ్రెస్ పార్టీ నిరుపేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. పార్టీలో చేరిన వారిలో మద్దెల జంగయ్య, సాయికుమార్, పొట్ట దయాకర్, జనార్దన్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణరెడ్డి, డి.వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, ఆగిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మద్దెల శ్రీను, మల్లారెడ్డి, పెంటయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

నియామకం

షాద్‌నగర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం ప్రతి నియోజకవర్గానికి సమన్వయకర్తలను నియమిస్తోంది. అయితే నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గానికి సమన్వయకర్తగా షాద్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ నేత, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ నాగర్‌కుంట నవీన్‌రెడ్డిని నియమిస్తూ శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి



పూజల్లో పాల్గొన్న భక్తులు

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని భూమానంద నల్లా ఉపేంద్ర ఆర్యులు అన్నారు. మండలంలోని గొల్లగూడ గ్రామంలో జరుగుతున్న సచ్చిదానంద సాయన్న ఆర్యుల 50వ స్వర్ణోత్సవం, సాందీప అచల ఋషి పరిపూర్ణ గురు మందిర వార్షికోత్సవ కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి గురు మందిరంలో గురు మందిర వ్యవస్థాపకుడు దయానంద నాగుల వెంకటేశం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా భూమానంద నల్లా ఉపేంద్ర ఆర్యులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని భక్తిమార్గంలో నడవాలని సూచించారు. సామాజిక సేవా కార్యక్రమాలను అలవాటు చేసుకోవాలన్నారు. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత ప్రాప్తిస్తుందన్నారు. కార్యక్రమంలో శంకర్‌గురుప్రసాద్, శివకుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

ఏపీఎం శ్రీదేవి



చుక్కాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న శ్రీదేవి

తలకొండపల్లి: ఓటు వజ్రాయుధం వంటిదని, ప్రతిఒక్కరూ తమ ఓటును తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఏపీఎం శ్రీదేవి సూచించారు. చుక్కాపూర్, ఖానాపూర్, అంతారం, సంఘాయిపల్లి, జంగారెడ్డిపల్లి, పడకల్, జూలపల్లి, వెల్జాల్, తదితర గ్రామాల్లో శుక్రవారం ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటు విలువ ఎంత ముఖ్యమైందో చెప్పారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఓటును తప్పనిసరిగా సద్వినియోగం చేసుకుంటామని మహిళా సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఏపీఎం శ్రీదేవి మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటును పారదర్శకంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా మండల సమాఖ్య అధ్యక్షురాలు మహేశ్వరి, సీసీలు విజయలక్ష్మి, రాములు, సత్యనారాయణ, లక్ష్మయ్య, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

ఏసీపీ కేపీవీ రాజు



ఇబ్రహీంపట్నంలో ఫ్లాగ్‌మార్చ్

ఇబ్రహీంపట్నం రూరల్: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు పేర్కొన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని రాయపోల్, దండుమైలారం గ్రామాల్లో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు మైబెల్లి, నాగరాజు, కృష్ణారెడ్డి, ఏఎస్ఐలు రత్నయ్య, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని అప్పారెడ్డిగూడలో నూతనంగా నిర్మించిన కోట మైసమ్మ ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని ప్రథమ పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ అనునిత్యం దైవచింతన కలిగి ఉండాలని సూచించారు. ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరారు. గ్రామానికి చెందిన ఆలయాన్ని నిర్మాణానికి సహకరించిన రవీందర్‌రెడ్డి కల్పన, శ్రీరాంరెడ్డి పద్మలత, లక్ష్మణ్‌రెడ్డి రేణుక దంపతులను ఆయన అభినందించారు. గ్రామ దేవతలను పూజించడం అనాదిగా వస్తున్న సంప్రదాయమని, అమ్మవారి అనుగ్రహంతో గ్రామస్తులందరూ సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌గౌడ్, నవాజ్‌రెడ్డి, సీతారాం, సత్యనారాయణ, తిరుపతిరెడ్డి, యాదగిరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఆలయ నిర్మాణ దాతలు

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ మాల



మాట్లాడుతున్న మహేశ్, తదితరులు

షాద్‌నగర్: భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని మాల మహానాడు సంఘం జిల్లా అధ్యక్షుడు మహేశ్ మాల అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మాలమహానాడు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మహేశ్ మాట్లాడుతూ.. దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు అంబేడ్కర్ అన్నారు. దేశం అన్ని మతాలు, తెగలు, వెనకబడిన వర్గాలకు సమన్యాయం జరిగేలా వారి హక్కులకు భంగం కలగకుండా ఉండేందుకు రాజ్యాంగాన్ని రూపొందించారని పేర్కొన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం అందరు కృషి చేయాలని, ఆయన చూపిన మార్గంలో నడవాలన్నారు. ఈనెల 14న నిర్వహించే అంబేడ్కర్ జయంతి సందర్భంగా షాద్‌నగర్‌లో అంబేడ్కర్ చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు, ఈ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వినోద్‌కుమార్, నాయకులు నర్సింహా, శ్రీను, మల్లేశ్, శేఖర్, ప్రవీణ్, షణ్ముకు ప్రసాద్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

జయంత్యుత్సవాలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం నాయకులు

షాద్‌నగర్‌రూరల్: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 14న పట్టణంలో నిర్వహించే పూలే, అంబేడ్కర్ జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలని ముదిరాజ్ సంఘం తాలుకా గౌరవ అధ్యక్షుడు అంచ రాములు అన్నారు. శుక్రవారం పట్టణంలోని దేవి గ్రాండ్ హోటల్‌లో ముదిరాజ్ సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంచ రాములు మాట్లాడుతూ.. మహనీయుల స్ఫూర్తితో ప్రజల్లో చైతన్యాన్ని తీసుకురావడంతో పాటు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ముదిరాజులు రాజ్యాధికారాన్ని సాధించినప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమన్నారు. పూలే, అంబేడ్కర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 14న పట్టణంలో పూలే, అంబేడ్కర్ జయంత్యుత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని కేశంపేటరోడ్డు నుంచి ఫరూఖ్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ జయంత్యుత్సవాల్లో అన్ని వర్గాలకు చెందిన నాయకులు, మేధావులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు శ్రీధర్‌వర్మ, మంగ వెంకటేశ్, అందె పైలయ్య, కానుగు అనంతయ్య, శీలం శ్రీను, యాదయ్య, మల్లేశ్ పూజారి, రమేశ్, బైరమోని మహేశ్, మంగ అశోక్, ప్రశాంత్, గిరిబాబు, మధు, సతీశ్, కుమార్, అజయ్‌వర్మ, శ్రీకాంత్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 17 వరకు బ్రహ్మోత్సవాలు

మొయినాబాద్: మండల పరిధిలోని సురంగల్‌లో ఈ నెల 13 నుంచి 17 వరకు మల్లికార్జునస్వామి, బీరప్పస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం మల్లికార్జునస్వామి మైలలు తీసే కార్యక్రమం నిర్వహించారు. 13న మల్లికార్జునస్వామి గంగ స్నానము, 14న మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం, బోనాల ఊరేగింపు, శివసత్తులు అగ్నిగుండాలు తొక్కుట, ఉక్క గొలుసు తెంపుట కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 15న బీరప్పస్వామి గంగ స్నానము, బోనాల ఊరేగింపు, బీరప్ప కామరాతి దేవి లగ్నము, 16న నాగవెల్లి, 17న గడప కడుగుట కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయినట్లు తెలిపారు.

ఘనంగా బీరప్ప విగ్రహ ప్రతిష్ఠ



బోనాల ఊరేగింపు

చేవెళ్ల : శంకర్‌పల్లి మండలంలోని ప్రొద్దటూరు గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ స్థాపన పూజ కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచే పూజలు కొనసాగాయి. సాయంత్రం బోనాల ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. దీంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ పూజా కార్యక్రమంలో చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, నాయకులు ఉదయ్‌మోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఏనుగు నర్సింహారెడ్డి, ఎంపీటీసీ ప్రవళిక వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌గౌడ్, సత్యం, మల్లయ్య, రంగారెడ్డి, బీర్ల నర్సింహ, బయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో చిరుజల్లులు



నక్కర్తమేడిపల్లిలో కురుస్తున్న చిరుజల్లులు

యాచారం: భానుడి ప్రతాపంతో ఎండల తీవ్రత పెరగడంతో ఉక్కపోత ఎక్కువైంది. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి, మల్కిజ్‌గూడ, యాచారం తదితర గ్రామాల్లో చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. దీంతో కొన్ని రోజులుగా ఎండలకు తల్లడిల్లుతున్న ప్రజలు వాతావరణం కొంత చల్లబడడంతో ఆనందం వ్యక్తం చేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



మాజీ మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే యాదయ్యను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

చేవెళ్ల: మండలంలోని ఊరేళ్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం మూడోరోజు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి బోనాలు చేసి నైవేద్యాలు సమర్పించారు. హోమాలు, పూజలతో ఊరేళ్ల గ్రామంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఈ పూజా కార్యక్రమంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీఆర్ఎస్ నాయకులు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉండే ఆలయాలతో ప్రజలకు మానసిక ప్రశాంతత లభిస్తోందని చెప్పారు. ప్రజలు ఆధ్యాత్మిక చింతన అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మండలంలోని బీజేపీ, కాంగ్రెస్‌ల నాయకులు సైతం వేరువేరుగా ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, గ్రామస్తులు నాయకులను శాలువాలతో సన్మానించారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమాల్లో గ్రామ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తే గెలుపు ఖాయం

మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం


మొయినాబాద్ రూరల్: నాయకులు, కార్యకర్తలు, బూత్‌స్థాయి అధ్యక్షులు అందరూ కష్టపడి పనిచేస్తే బీజేపీ గెలుపు ఖాయమని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో గల బీజేపీ కార్యాలయంలో ఆయా గ్రామాల బూత్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం 14వ తేదీన సాయంత్రం మొయినాబాద్ మండల కేంద్రంలోని అంజనాదేవీ గార్డెన్‌లో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హాజరవుతారని సూచించారు. గ్రామాల్లో పోలింగ్ బూత్ కేంద్రాల అధ్యక్షులు ఆయా గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలను అభిమానులను పెద్ద సంఖ్యలో సమావేశానికి తరలించాలని ఆయన సూచించారు. అదే విధంగా ఇంటింటికీ బీజేపీ ప్రచారాన్ని త్వరలో ప్రారంభిస్తారని తెలిపారు. దేశంలో మూడోసారి పీఎం మోదీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండాను ఎగరవేసుకుందామన్నారు. ఆదివారం జరిగే మండలస్థాయి బీజేపీ సమావేశానికి అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు తూర్పు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శి రాజమల్లేశ్, నాయకులు రాజుగౌడ్, మాధవరెడ్డి, మహేందర్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కె.ఎస్.రత్నం, నాయకులు

మహబూబ్‌నగర్ తరలిన బీజేపీ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మహబూబ్‌నగర్ పట్టణంలోని బృందావన్ గార్డెన్‌లో పార్లమెంట్ బీజేపీ విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి పట్టణం నుంచి పలువురు నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రధాని మోదీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని గడపగడపకూ కేంద్ర ప్రభుత్వ పథకాలను తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీని గెలిపించాలన్నారు. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలన్నారు. బూత్ స్థాయిలో అందరం కలిసికట్టుగా కష్టపడి పనిచేస్తే బీజేపీ ఎంపీ అభ్యర్థి డికె.అరుణమ్మ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం శ్రీవర్ధన్‌రెడ్డి జెండా ఊపి వాహన ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు దేపల్లి అశోక్‌గౌడ్, వంశీకృష్ణ, హరిభూషణ్, అశోక్, శేరి విష్ణువర్ధన్‌రెడ్డి, సుధాకర్‌రావు, నర్సింహా, లష్కర్‌నాయక్, మోహన్‌సింగ్, చెన్నయ్య, సుధాకర్‌అప్ప తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి వెళ్తున్న నాయకులు